కలసి పనిచేస్తే గెలుపు సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: వచ్చే పార్లమెంటు ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడి పని చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసి ఎంపి రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా పాటుపడాలన్నారు. పార్లమెంటు సీటును కైవసం చేసుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందు సాగాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ మహేందర్‌గౌడ్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్

శంషాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షిని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాలతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి విస్తృతంగా కృషి చేయాలని ఈ సందర్భంగా వారికి ఆమె సూచించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మంచి ఫలితాలు తీసుకురావడంతో ఎస్సీసెల్ ప్రధాన పాత్ర పోషించాలన్నారు.

పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయండి



ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవన్‌దాస్, ప్రధాన కార్యదర్శి కోరని బాల్‌రాజ్

రాజేంద్రనగర్: శివరాంపల్లి కొత్త వీక్షన్ సెక్షన్ కాలనీలో దాదాపు 3 వేల మంది ఉన్నారని... వీరందరికి సమీపంలోని బూత్‌లో ఓటు వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ దళితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. జీవన్‌దాస్, ప్రధాన కార్యదర్శి కోరని బాల్‌రాజ్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శివరాంపల్లి కొత్త వీక్షన్ సెక్షన్ కాలనీ ప్రజలు గత శాసనసభ ఎన్నికల్లో 5 కి.మీటర్ల దూరంలో పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. వీరందరికి అందుబాటులో ఉన్న దళితబస్తీలోని కమిటీ హాల్, డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం భవనం, వృద్ధాశ్రమంలో బూత్‌లను ఏర్పాటు చేసి స్థానికంగా ఓటు ఉన్న వారికి అక్కడే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పొంగుతున్న డ్రైనేజీ



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు ఖిజ్రా కాలనీలో డ్రైనేజీ గత వారం రోజులుగా రోడ్లపై పారుతుందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ప్రవేశ రోడ్డులోనే డ్రైనేజీ నీరు పొంగి ప్రవహిస్తుండటంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే ముక్కులు మూసుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు. దుర్గంధంతో అనేక మందికి జ్వరాలు, శ్వాసకోస వ్యాదులు వస్తున్నాయన్నారు. అదే విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదన్నారు. ఇకనైనా మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విభిన్న భాషల ఐక్యతే మన విశిష్టత

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ ఆచార్య సి మృణాళిని

రాయదుర్గం: విభిన్న భాషలు ఉన్నప్పటికీ వాటి మధ్య ఐక్యత కొనసాగడమే భారతదేశ విశిష్ట లక్షణమని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగ కన్వీనర్, సిలికానాంధ్ర(యూఎస్ఏ) తెలుగు శాఖ అధ్యక్షురాలు ఆచార్య సి.మృణాళిని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో మానవీయశాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ ఆడిటోరియంలో మంగళవారం భారతీయ భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మృణాళిని మాట్లాడుతూ.. మహాభారతాన్ని మూలంలో భావం కోల్పోకుండా తెలుగులోకి అనుసృజన చేసిన గొప్పతనం కవిత్రయ భారతానికి చెందుతుందన్నారు. వ్యాస మహాభారతంలోని పరమార్థాన్ని యథాతథంగా తెలుగులోకి తీసుకొచ్చారన్నారు. తెలుగు ప్రజలకు భక్తి కంటే లౌకి విషయాలపై ఆసక్తి ఎక్కువని చెప్పారు. ఆ దిశగానే సాహిత్యం కూడా వెలువడిందన్నారు. సుబ్రహ్మణ్య భారతి తన రచనల్లో కందుకూరి వీరేశలింగం పంతులుని ఒక పాత్రగా చేసిన ఆయన గొప్పతనాన్ని వర్ణించారని గుర్తుచేశారు. ఆమె తమిళ కవి అయినప్పటికీ తెలుగుని సుందరమైన భాషగా ప్రశంసించారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కూడా 24 భాషల్లో జాతీయ స్థాయి పురస్కారాలను అందిస్తోందన్నారు. అనంతరం డీన్ ప్రొఫెసర్ వి.కృష్ణ మాట్లాడుతూ.. భారతీయ భాషా దినోత్సవం భారతీయ సమైక్యతకు నిదర్శంగా భావించాలన్నారు. ఇఫ్లూ యూనివర్శిటీ అనువాద శాఖ అధ్యక్షుడు ఆచార్య వీబీ తారకేశ్వర్ మాట్లాడుతూ.. విభిన్న భాషలకు కేంద్రంగా భారతదేశం కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా హిందీ శాఖ అధ్యక్షుడు ఆచార్య సి.అన్నపూర్ణ సుబ్రహ్మణ్య భారతి కవితలను, ఆచార్య పిల్లలమర్రి రాములు తెలుగు కవితను ఆలపించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు వ్యవహరించిన ఈ సమావేశంలో ఆచార్యులు బి.భీమయ్య, ఏఎం ఫజలుల్లా, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల చిత్రాలు



మాదాపూర్: చిన్నారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం సిల్వర్ ఓక్స్ పాఠశాల విద్యార్థులు వేసిన చిత్రాలను 'సమీకృత' పేరిట ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఓన్ స్టూడియో డైరెక్టర్ వైదికరావు కాట్రగడ్డ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. 190 మంది విద్యార్థులు వేసిన 190 చిత్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు.

ఆదమరిస్తే.. అదనపు బాదుడే

పండక్కి ఊరెళ్లేవారు ఫాస్ట్‌ట్యాగ్ సరి చూసుకోండి

- తక్కువ దూరానికే ఎక్కువ ఛార్జీలు
- ఫాస్ట్‌టాగ్‌తో తరుచూ ఇబ్బందులు



పోలీస్ ఆకాడమీ చౌరస్తా నుంచి గచ్చిబౌలి వెళ్లే ఔటర్ టోల్‌గేట్

బండ్లగూడ: సంక్రాంతి పండక్కి ఊరెళ్లేవారు అప్రమత్తంగా ఉండాల్సిందే. లేదంటే జేబులకు చిల్లే.. ఔటర్ రింగురోడ్డుపై సొంతుళ్లకు వెళ్ళే వాహనదారులు తమ ఫాస్టటాగ్ సరి చూసుకొకుంటే అంతేమరి.. ప్రయాణించిన దూరంకంటే ఎక్కువ ఛార్జీలు చెల్లిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒకే ఎంట్రీ నుంచి ఒకే ఎగ్జిట్‌కు రూ.30 చెలిస్తే సరిపోతుంది. సాంకేతిక కారణాలతో ఫాస్టటాగ్ రీడ్ కాకపోతే ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ఎగ్జిట్ వద్ద రూ. 90ల పైనే చెలించవలసివస్తుంది. భారీ వాహనాలైతే ఆ మొత్తం వందల్లో ఉంటుంది. ఎంతో మంది వాహనదారులకు ఇలాంటి అనుభవమే ఎదురవుతుంది. కొందరు వాహనదారులు యజమాన్యానికి ఫిర్యాదులు చేస్తుండగా.. ఎప్పుడో ఒకసారి ఓఆర్ఆర్‌పై తిరిగే వారు ఆ సంగతే పట్టించుకోవడంలేదు.

సాంకేతిక లోపంతో అదనపు ఛార్జీలు..

టోల్ గేట్ వద్ద నుంచి ఔటర్‌పైకి వెళ్ళే వాహనాలు తప్పనిసరిగా నిర్ణీత దూరానికి టోల్ చార్జీలు చెలించవలసి ఉంటుంది. ఎక్కువ శాతం వాహనదారులు ఫాస్టటాగ్‌తోనే చెల్లింపులు జరుపుతారు. అయితే ఫాస్టటాగ్ సాంకేతిక లోపంతో రీడ్ కాకపోతే అదనంగా చార్జీలు కట్టవలసి వస్తుంది. కొన్ని సార్లు ఔటర్‌పై రద్దీ పెరిగినప్పుడు టోల్ సిబ్బంది ఫాస్టటాగ్ రీడ్ కాకపోతే ఎంట్రీ వద్ద నుంచి వాహనాలను పంపిస్తుంటారు. అలాంటపుడు ఈ చార్జీల భారం మూడు రెట్లు పెరుగుతుంది.

టోల్ చార్జీలు 10 నుంచి 170 వరకు....

ఔటర్ పైకి వెళ్లే కార్లకు టోల్ చార్జీలు ఎగ్జిట్‌ను బట్టి 10 నుంచి 170 వరకు ఉంటుంది. అదే భారీ వాహనాలైతే ఆయా ఎగ్జిట్‌ను బట్టి 800 వరకు చార్జీలు వసూలు చెస్తుంటారు. ఔటర్‌పై 24 గంటలలో రెండుసార్లు ప్రయాణం చేస్తే 50 శాతం టోల్ చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది.

టోల్‌గేట్‌కు 100 మీటర్ల దూరంలో క్యూ

జాతీయ రహదారులపై ప్రయానించే వారికి టోల్ గేట్ల వద్ద ఆటంకాలు తప్పడం లేదు. టోల్ చార్జీలు బాదుడు సంగతి ఎలా ఉన్నా టోల్ గేట్ల వద్ద వాహనాలు భారీ క్యూలతో దర్శనమిస్తున్నాయి. ప్రయాణం అంతకుంతకు ఆలస్యమవుతుంది. ఆ నేపథ్యంలో ఇకపై వంద మీటర్ల దాటితే ఆ తర్వాత నుంచి వాహనాలకు టోల్ చార్జీలు చెలించవలసిన అవసరం లేదని కేంద్రం ప్రకటించింది. దీంతో వాహదారులకు భారీ ఊరట లభించింది.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా గురువు గౌతమ్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: యోగాను ప్రతి నిత్యం చేయడం వలన శారీరకంగా, మానసింకగా ఎంతో దృఢత్వాన్ని పెంపొందించకోవచ్చని యోగా మానసిక ప్రశాంతతను కల్పిస్తుందని ఉద్యాన కళాశాల డీన్ ప్రశాంత్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన కళాశాలలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న యోగా వెల్నెస్ ప్రొగ్రాం మంగళవారం ముంగిపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతు యోగా అనేది దినచర్యలో ఒక అంతర్భాగంగా కావాలని, రోజు విద్యార్థులు సూర్య నమస్కారాలు చేయడం వలన శరీరం, మనస్సు తమ ఆధీనంలో ఉంటుందని వివరించారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు చాలా మానసికంగ ఒత్తిడికి గురవుతున్నారని దానిని అదిగమించాలంటే యోగా చేయాలని అన్నారు. ఈ సందర్భంగా 10 రోజులు యోగా సాధన చేయించిన గురువును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి సంతోషిని, అశ్వనికుమార్, శ్రీనివాస్, నిరోషా, నాగ హర్షిత, యోగా గురువు గౌతమ్, శ్రీరాములు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. జనప్రియ ఏబీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, అత్తాపూర్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, నందిముస్లాయిగూడ యుజీసీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని మల్లన్న దేవాలయ ఆవరణలో బుధవారం ఉదయం 9గంటలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు పి. రూపారెడ్డి తెలిపారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి రూ. 5వేలు, రెండవ బహుమతి రూ. 3వేలు, మూడవ బహుమతి రూ. 2వేలు ఇస్తామన్నారు. విజేతలకు బహుమతులను స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు.

త్వరలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు: ఎమ్మెల్యే

శంషాబాద్: ప్రజలకు ఇబ్బందులు కలగకుంగా త్వరలో సిద్ధాంతి, సాతంరాయిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీల ఏర్పాటు జరగనుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సిద్ధాంతి, సాతంరాయిలో హైవే దాటేందుకు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనికి కోసం గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఈ రెండింటితో పాటు గగన్‌పహాడ్ వద్ద అండర్ బ్రిడ్జీని కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే బుద్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీ పనులు కొనసాగుతున్నాయన్నారు.

బస్సు సర్వీసుల పెంపు పై డిమాండ్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

శంషాబాద్ రూరల్: గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని పలువురు సర్పంచులు మండల సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీపీ జయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలను విన్నవించారు. చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలకు బస్సు సర్వీసులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణం సమయంలో ఆధార్‌కార్డు జిరాక్స్ లేదా ఫోన్‌లో చూపించినా అనుమతించాలని కోరారు. సర్పంచుల పదవి త్వరలో ముగియనుండగా.. కొత్త సర్పంచులు వచ్చే వరకు గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తన్వి, వైఎస్ ఎంపీపీ నీలం, సొసైటీ చైర్మన్లు సతీష్, దౌనాకర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు ఇందిరా, గౌతమి, యాదగిరి, కో–ఆప్షన్ సభ్యుడు గౌస్, సర్పంచులు రాంగోపాల్, బుచ్చమ్మ, హర్షి, కల్పన సింహారెడ్డి, సతీష్, రమేష్, దేవా, సిద్దులు తదతరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో చెత్త తొలగింపు



ఇక్కడ చెత్త వేయవద్దని రాసిన కార్పొరేటర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడ గుమ్మకొండ కాలనీలో మంగళవారం అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ చెత్త వేసి ఓపెన్ పాయింట్ నిర్మూలన కొరకు తన సొంత నిధులతో చెత్త మట్టికుప్పలను తొలగించి... ప్రజలు చెత్త వేయవద్దని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటింటికి చెత్త ఆటోలు వస్తూ ఉండగా చెత్త పరిసరాల్లో వేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు వారు కూడా మనలాంటి మనుషులేనని.. పొద్దున లేచినప్పటి నుంచి ఎడతెరిపి లేకుండా వీధుల్లో చెత్త చెదారం, మురికితో కూడుకున్న చెత్తను రోజు తరలిస్తూ ఉంటారన్నారు. వారి కోసం ప్రజల కోసం ఈ చెత్త వేసే ఓపెన్ పాయింట్ తగ్గిస్తే కొంతనైనా ఉపశమనం కలుగుతుందని బావించి ప్రజలకు రావడానికి, పొవడానికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉన్న ప్రదేశం కాబట్టి ఈ ప్రాంతంలో చెత్త వేయరాదు అని గోడపైన ఎర్రటి అక్షరాలతో రాయించి ఇదివరకే తమ ఆధ్వర్యంలో తమ సొంత నిధులతో అత్తాపూర్ డివిజన్‌లోని చాలా వరకు ఓపెన్ పాయింట్‌లను నిర్మూలించడం జరిగిందన్నారు. బలవంత రెడ్డి, హనుమంత్ రెడ్డి, నరసింహా చారి, రజిని, పున్నమ్మ, రమ, శారద, సులిగే సుశీల, సులిగే పద్మ, సంగీత, సురేశ్, మల్లేష్, నరసింహా, బస్తీవాసులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి ప్రజలకు రుణపడి ఉంటా

హఫీజ్‌పేట్: మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. మంగళవారం చందానగర్ హుడా కాలనీలో ఎమ్మెల్యేకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అండగా ఉన్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, మల్లారెడ్డి, మనోహర్ గౌడ్, వాలా హరీష్ రావు, లక్ష్మారెడ్డి, దాత్రి నాథ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, జనార్దన్, పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరించిన వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ ప్రజలందరికీ నూతన సంవత్సరం అన్ని విధాలుగా కలిసిరావాలని వైస్ చైర్మన్ జి. వెంకటేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అన్ని మతాలను గౌరవిస్తూ అందరికీ ఉపయోగపడే కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రతి ఇంటికి క్యాలెండర్‌ను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బండ్లగూడ: గండిపేట మండల పీఆర్‌టీయూటీఎస్ శాఖ డైరీ, వాల్ టేబుల్, కేలండర్‌లను మంగళవారం ఆవిష్కరించారు. రాజేంద్రనగర్ ఎంఈవో కార్యాలయంలో రాంరెడ్డి, ఎంఎన్‌వో విజయ్‌కుమార్, హోప్ ఫౌండేషన్ సంస్థ కొండ విజయ్‌కుమార్, బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. పిఆర్‌టియూటిఎస్ సంఘం ఎల్లప్పుడు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ముందు ఉంటుందని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను నూతన ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని గండిపేట సంఘం అధ్యక్షులు బి. మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. గౌరవ అధ్యక్షులు పి. కిరణ్, ప్రధాన కార్యదర్శి బి. నర్సింలు, బి.యాదయ్య, పి.రవిబాబు, సి.హెచ్.రాములు, బి.నర్సింలు, సంజీవ, ఇమ్రాన్ ఆలీ, సురేష్, గోకుల్, రాఘవేందర్ పాల్గొన్నారు.



పిఆర్‌టియూటిఎస్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రక్త దానం ప్రాణదానంతో సమానం



ఏజీవర్సిటీ: రక్త దానం ప్రాణదానంతో సమానమని రోజు ఎంతో మంది క్షతగాత్రులకు సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని మనం ఇచ్చె రక్తంతో అనేక మందిని కాపాడవచ్చునని పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పశువైద్య విశ్వవిద్యాలయంలో పి.వి చారటబుల్ ట్రస్ట్, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాని వీసీ ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో 200 మంది కళాశాల విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్ని 40 యూనిట్ల రకాన్ని దానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో పి.వి నరసింహారావు మనమడు పి.వి చారటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుధాకిరణ్ రక్త దానం చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ రఘునందన్, చిన్నపిత్రం, ఉదయ్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు ఆహ్వానం



ప్రిన్సిపాల్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న శ్రీధర్, బాబురావు తదితరులు

రాజేంద్రనగర్: స్వామి వివేకనంద జయంతి, అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నేడు, రేపు జరగబోయే క్రికెట్ పోటీలకు హాజరు కావాలని ఎన్ఐఆర్‌డీ జాతీయ విద్యభవాన్స్ విద్యాశ్రం స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్‌ను మంగళవారం నిర్వాహకులు కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ క్రికెట్ పోటీల్లో దాదాపు 10 స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు జి. బాబురావు, వెంకటరమణ, జి. అరుణ్ కుమార్, వి. దయాకర్‌లు పాల్గొన్నారు.

నెమలినగర్‌లో అక్షింతల పంపిణీ



ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను మంగళవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెమలినగర్‌లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కె. నరసయ్యచారి ఈ నెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరుగుతుందని, ఆ రోజు సాయంత్రం ప్రతి ఇంట్లో ఐదు దీపాలను వెలిగించాలన్నారు. అక్షింతలకు మరిన్ని కలుపుకుని వాటితో పిల్లలను ఆశీర్వదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామభక్తులు డి. శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, బాలరాజ్ గౌడ్, ఆంజనేయులు, ధనుంజయులు, సత్యనారాయణ, వెంకటేష్, నరసింహులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 55ను రద్దు చేయాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాలకు సంబంధించిన భూమిలో హైకోర్టు భవనాలను నిర్మించాలని ప్రభుత్వం ఇచ్చిన జీఓ 55ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని జయశంకర్ విగ్రహం ముందు మంగళవారం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ఇక్కడ భూములు కేటాయించడం ద్వారా జీవవైవిధ్య పార్కుతో పాటు అరుదైన ఔషధ జాతీమొక్కలు అంతరించిపోతాయన్నారు. ఇక్కడ ఉన్న మొక్కలను కర్ణాటక, కేరళ, తమిళనాడు, గోవా జబల్‌పూర్, ఒరిస్సా, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల పరిశోధన స్థానాలు తిరిగి సేకరించి తీసుకురావడం జరిగిందని అలాంటి మొక్కలు ప్రస్తుతం చెట్లుగా ఎదిగాయని భవనాలు నిర్మాణం చేయడం ద్వారా ఇవి అంతరించిపోతాయన్నారు. హైకోర్టు నిర్మాణానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం భూముల కాకుండా ఇతర భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి బయోడై వర్సిటీ వరకు ర్యాలీ నిర్వహించారు.

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది

డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో ప్రొఫెసర్ అమితాబ్ కుందు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అమితాబ్ కుందు

రాయదుర్గం: భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో ప్రొఫెసర్ అమితాబ్ కుందు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం 'ఇండియా టువర్డ్స్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అవకాశాలు, చాలెంజెస్' అనే అంశంపై వ్యవస్థాపక దినోత్సవ ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ మాట్లాడుతూ.. బ్రూకింగ్స్ ప్రొజెక్షన్స్ ఆఫ్ షేర్ సంస్థ 2028 నాటికి భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అంచనా వేసిందని గుర్తు చేశారు. లేబర్ మార్కెట్ యాక్సెస్‌లో ఉన్న అసమానతలు కొద్దిగా తగ్గుతాయన్నారు. 2050లో భారతదేశ వాటా 27 శాతంగా ఉండవచ్చని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా వేసిందన్నారు. అనంతరం 'మనూ' చాన్స్‌లర్ ముంతాజ్‌అలీ మాట్లాడుతూ.. త్వరలో నిర్వహించే ఉర్దూ విశ్వవిద్యాలయ కాన్వకేషన్‌కు రాష్ట్రపతిని ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దేశాభివృద్ధిలో ఆర్థిక వ్యవస్థ, విద్య కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హాసన్ మాట్లాడుతూ.. త్వరలో స్కూల్ ఆఫ్ లా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో 'మనూ' ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుప్తా షాహీన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు సయ్యద్ షా మహ్మద్ మజారుద్దీన్ ఫారూఖీ, అమీనా కిషోర్, నసీముద్దీన్, ఎస్ఎం రహమతుల్లా, తహసీన్ బిల్గ్రామి, పీఎస్ మునవర్ హుస్సేన్‌ఖాన్, మల్లిక, షేక్ మహ్మద్ సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంఏ సమీ సిద్దిఖీ, మహ్మద్ ముస్తఫా అలీ సర్వారీ, మేరాజ్ అహ్మద్, ఐఎంసీ డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ పాల్గొన్నారు.